www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -358 ఆదివారం 5 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం

తీవ్రంగా ఖండించిన హరీష్ రావు




## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి

6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన

అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):** :బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ. 225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. **మిగతా 2లో...**

## 5 కేజీల గ్యాస్ సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం

ఏదైనా ఐడీ కార్డుతో 5 కేజీల ఎల్పీజీ సిలిండర్

అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదని స్పష్టం చేసిన కేంద్రం

దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కొరత లేదు




## అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు

సకాలంలో పూర్తి చేయకపోతే ఆలోచిస్తాం

బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు



**అమరావతి ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అమరావతి రాజధాని అంశంపై మరోసారి చర్చనీయాంశంగా మారేలా వైసీపీ నేత బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై తీర్మానం చేసినంత మాత్రాన అది శాశ్వతం కాదని, అసలు నిర్మాణం పూర్తి కావడం ద్వారానే రాజధాని స్థిరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి మాకు ప్రయారిటీ కాదు. అది మాకు శాసన రాజధాని మాత్రమే. అలాంటప్పుడు మేమెందుకు రూ.లక్షా పదివేల కోట్లు ఖర్చు చేస్తాం? అమరావతి **మిగతా 2లో...**

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు

కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ




## కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలి

: మంత్రి నారా లోకేశ్

విశాఖ ఉక్కును కాపాడింది ఆయనేనని ప్రశంస

కర్ణాటకలో సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ మంత్రి నారా లోకేశ్




## అణిచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో చోటు లేదు

క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలు బీఆర్ఎస్ కైవసం.. స్పందించిన కేటీఆర్

కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందన్న కేటీఆర్



## ప్రళయానికి 48 గంటలే

ప్రళయం విరుచుకుపడడానికి 48 గంటలే మిగిలి ఉంది: ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

హార్ముజ్ జలసంధిని మూసివేయవద్దని ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

48 గంటల్లో నరకం చూపిస్తామని, 20 రెట్ల బలంతో దాడి చేస్తామని స్పష్టీకరణ

ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావంతో పెరుగుతున్న గ్యాస్ ధరలు

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో తాజా పరిణామాలు



**ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు అత్యంత తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. హార్ముజ్ జలసంధిని మూసివేసే ప్రయత్నం చేస్తే కేవలం 48 గంటల్లో ప్రళయం తప్పదని, నరకం చూపిస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.
ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి ద్వారా సరఫరాను అడ్డుకుంటే, అమెరికా 20 రెట్లు ఎక్కువ బలంతో ప్రతిదాడి చేస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం**మిగతా 2లో...**

## ఆ రెండు మున్సిపల్ పీఠాల్లో బీఆర్ఎస్

ఖానాపూర్ చైర్మెన్ ఎన్నిక మూడోసారి వాయిదా

బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ఆందోళన

పోలీసులు స్వల్ప లాఠీచార్జి క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్

-సీపీఐ కైవసం ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ బీఆర్ఎస్‌కే..






## సహజరణానికి కూడా పదిలక్షల బీమా సింగరేణి కార్మికులకు శుభవార్త

2లో.

# ఆ రెండు మున్సిపల్ పీఠాల్లో బీఆర్ఎస్

**ఆదిలాబాద్ ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):** మున్సిపల్ ఎన్నికల తర్వాత పలు కారణాలతో వాయిదా పడిన పాలకవర్గాల ఎన్నికను అధికారులు పోలీసు బందోబస్తు మధ్య శనివారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మెన్ పీఠాలను ఇతరుల మద్దతుతో బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. కాగా, ఖానాపూర్ ఎన్నిక నాటకీయ పరిణామాల మధ్య మూడోసారి వాయిదా పడింది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో వాయిదా పడిన రెండు మున్సిపాలిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికను పోలీసులు భారీ బందోబస్తు నడుమ నిర్వహించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక భారీ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నిక మొదటిసారి కోరం లేక వాయిదా పడగా, రెండోసారి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల గొడవతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ఈ ఘర్షణల నేపథ్యంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ వచ్చినప్పటికీ మంత్రి వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ అభ్యర్థిని చైర్మెన్‌ను చేయడానికి పట్టుబట్టారు. బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేయడంతో రెండోసారి సైతం ఎన్నిక వాయిదా పడింది. దీంతో పోలీసులు భారీ బందోబస్తు నడుమ శనివారం నిర్వహించిన ఎన్నికలో బీఆర్ఎస్‌కు 10 స్థానాలు రాగా.. సీపీఐ నుంచి గెలుపొందిన నలుగురు కూడా ఆ పార్టీకి మద్దతు తెలపడంతో మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్‌గా గొడిసెల సంధ్యారాణి ఎన్నికకాగా, వైస్ చైర్‌పర్సన్‌గా సీపీఐ అభ్యర్థి సరిత ఎన్నికయ్యారు.

**ఖానాపూర్ మళ్లీ వాయిదా..**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్నికను మరోసారి వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 12 కౌన్సిలర్ స్థానాలు ఉండగా.. కాంగ్రెస్ 4, బీఆర్ఎస్ 4, బీజేపీ 4 స్థానాల్లో గెలుపొందాయి. చైర్మెన్ ఎన్నికకు ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో కోరం లేక గతంలో రెండు సార్లు వాయిదా పడింది. శనివారం ఎన్నిక నిర్వహించగా ఇటీవల ఒక బీఆర్ఎస్ కౌన్సిలర్ కాంగ్రెస్‌కు మద్దతు తెలపడంతో ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఎక్స్‌అఫీషియో ఓటుతో మొత్తం ఆరు ఓట్లు అయ్యాయి. ఎన్నికల అధికారి సమక్షంలో బీఆర్ఎస్ తరపున బీజేపీ కౌన్సిలర్ అంకం మౌనికను చైర్మెన్ అభ్యర్థిగా ప్రతిపాదించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముగ్గురు, బీజేపీ కౌన్సిలర్లు నలుగురు మొత్తం ఏడుగురు మద్దతు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థిగా చిన్న సత్యంను ప్రతిపాదించాలని ఎమ్మెల్యే కోరారు. ఆయనకు మద్దతిచ్చిన కౌన్సిలర్లలో బీజేపీ కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి చెయ్యి ఎత్తే విషయంలో గందరగోళం చోటుచేసుకుంది. చైర్మెన్ అభ్యర్థి సత్యం ఆమె చేయి ఎత్తారని ఆందోళనకు దిగడంతో గందరగోళం ఏర్పడింది. ఆమె మాత్రం తాను చేయి ఎత్తలేదంటూ ఈ క్రమంలో ఒత్తిడికి గురై స్పృహ కోల్పోయారు. మున్సిపల్ కార్యాలయంలో గొడవ జరుగుతుందని తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, బీజేపీ నాయకులు రితీష్ రాథోడ్ తమ అనుచరులతో లోనికి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు అడ్డుపడటంతో వారిని తోసేసి వంద మీటర్ల పరిధి దాటే ప్రయత్నం చేయగా పోలీసులు లాఠీచార్జి చేశారు. అనంతరం రెండు గంటలపాటు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఆందోళన తీవ్ర కావడంతో ఎన్నికను వాయిదా వేస్తునట్టు ఎన్నికల అధికారి జీవరత్నం ప్రకటించారు.

**ఇబ్రహీంపట్నం చైర్మెన్‌గా సుదర్శన్‌రెడ్డి ఎన్నిక నుంచి కాంగ్రెస్ వాకౌట్**

భారీ పోలీస్ బందోబస్తు, ఆంక్షలు, ఉత్కంఠ భరిత పరిణామాల మధ్య జరిగిన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠం చివరకు బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. చైర్మెన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా బీజేపీకి చెందిన ముత్యాల శ్యామల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను కాంగ్రెస్ బహిష్కరించింది. శనివారం ఉదయం నుంచే ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉత్కంఠ వాతావరణం ఏర్పడింది. సుమారు 800 మంది పోలీసులతో ఇనుప కంచెలు వేసి, 144 సెక్షన్ విధించిన నేపథ్యంలో కౌన్సిలర్లు పార్టీల వారీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు.

24 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. స్పష్టమైన కోరం ఉండటంతో ప్రిసైడింగ్ అధికారిగా జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు.

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

## సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు

## కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

**తిరువనంతపురం ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):** జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో



అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ది పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్టాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు

**మొదటిపేజీ తరువాయి**

పనులు వేగంగా పూర్తి చేయాలి. సీఎం చంద్రబాబు అమరావతిని జాప్యం చేస్తే మేం ఇంకో ఆలోచన చేస్తాం అని బొత్స అన్నారు.రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, అమరావతి అంశం చుట్టూనే ప్రభుత్వం, మీడియా తిరుగుతోందని బొత్స విమర్శించారు. ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టి ఒకే అంశంపై దృష్టి సారించడం దురదృష్టకరమని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, మామిడి పండ్లలో కూడా కల్తీ జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణం విషయానికి వస్తే, గతంలో టీడీపీ ప్రభుత్వంలో కేవలం 5 శాతం పనులే పూర్తయ్యాయని బొత్స పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోయినా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు అమరావతిపై ఎంత ఖర్చు చేశారు, ఎంత ఫిజికల్‌గా పనులు జరిగాయి, ఎంత మొత్తాన్ని అడ్వాన్స్‌లుగా ఇచ్చారు అనే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణ వ్యయం మొదట లక్ష 16 వేల కోట్లుగా అంచనా వేయగా, ఇప్పుడు అది రెండు లక్షల కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. నిర్మాణ వ్యయాల్లో భారీ పెరుగుదలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన భవనాలను పూర్తి చేసి ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, పార్లమెంట్‌లో అమరావతిపై చూపిన శ్రద్ధను ప్రత్యేక హోదా సాధనపై ఎందుకు చూపలేదని ప్రశ్నించారు బొత్స. ప్రత్యేక హోదా వస్తే ముంబై స్థాయి నగరాలు, అనేక అభివృద్ధి కేంద్రాలు రాష్ట్రంలో ఏర్పడే అవకాశముందని అన్నారు. అమరావతిని ఆపేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేసిన బొత్స, ప్రభుత్వం ముందుగా నిర్మాణ పనులను పూర్తి చేసి తరువాతే ప్రకటనలు చేయాలని సూచించారు. కేవలం పేర్లు పెట్టడం లేదా ప్రకటనలు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యం కాదని విమర్శించారు. మొత్తంగా అమరావతి అంశంలో రాజకీయ విమర్శలు ముదురుతున్న నేపథ్యంలో, బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసే అవకాశముంది.

# అణిచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో చోటు లేదు

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**

క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాలు బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ప్రజాస్వామ్య జయకేతనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందని అన్నారు. ఇది హర్షణీయమని పేర్కొన్నారు. అణిచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో చోటులేదని ఈ తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు.

విజయం సాధించిన ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ గెలుపు కోసం కృషి చేసిన బాల్క సుమన్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి తదితరులకు ఆయన అభినందనలు తెలియజేశారు."అడ్డదారుల్లో ఈ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్ని రకాల ప్రలోభాలు పెట్టినా, రకరకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా వేటికి లొంగకుండా మొక్కవోని దీక్షతో ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్లకు ప్రత్యేకంగా సెల్యూట్ చేస్తున్నా. క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు మిత్రపక్షమైన సీపీఐ కామ్రేడ్లు అడుగడుగునా కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకం" అన్నారు.అణచివేతకు, బెదిరింపులకు, అవినీతి అక్రమాలకు, అప్రజాస్వామిక చర్యలకు తెలంగాణలో తావులేదని ఈ తీర్పు తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. రెండున్నరేళ్లలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్ డౌన్ మొదలైందని ఈ ఫలితాలు నలుదిశలా చాటి చెప్పాయని అన్నారు.

అటు పంచాయతీ, ఇటు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పట్టించిన గులాబీ జెండా సైనికులను పార్టీ ఎప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ విజయాలు అందించిన స్ఫూర్తిని కొనసాగిద్దామని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అడుగడుగున ధ్వంసం చేస్తున్న రేవంత్ సర్కారుకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.

# సింగరేణి కార్మకులకు శుభవార్త

## సహజరణానికి కూడా పదిలక్షల బీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం దిశగా మరో కీలక అడుగు పడింది. సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవతో, కార్మికులకు లభించే బీమా సౌకర్యం ఇప్పుడు మరింత విస్తృతమైంది. ఇకపై ప్రమాదవశాత్తు జరిగే మరణాలకే కాకుండా, సహజ మరణానికి కూడా రూ. 10 లక్షల ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. సాధారణంగా బ్యాంకులు ప్రమాద బీమాను మాత్రమే అందిస్తుంటాయి. అయితే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం యూనియన్ బ్యాంక్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. కార్మికులందరికీ జీతాల ఖాతాలు అదే బ్యాంకులో ఉండటంతో, సామాజిక బాధ్యతలో భాగంగా ఈ అదనపు ప్రయోజనాన్ని కల్పించేందుకు బ్యాంక్ అంగీకరించింది.సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ నూతన బీమా విధానం ఈ నెల 1వ తేదీ నుండే అమలులోకి వచ్చింది. దీని కోసం కార్మికులు ఎటువంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా ఉచితంగా అందించే సేవ. సింగరేణి వంటి కష్టతరమైన వృత్తిలో ఉన్న కార్మికులకు ఈ పథకం పెద్ద అండగా నిలవనుంది. విధి నిర్వహణలో కాకుండా, ఇంటి వద్ద సహజంగా మరణించినా వారి కుటుంబాలకు ఈ 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. ఇది కార్మిక కుటుంబాల్లో భరోసాను నింపుతోంది. సింగరేణి చరిత్రలో ఇలా సహజ మరణానికి కూడా భారీ మొత్తంలో బీమా వర్తించడం ఇదే తొలిసారి అని కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాజమాన్యం , యూనియన్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికుల నుండి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రళయానికి 48 గంటలే

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగుతున్న తరుణంలో ఈ హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే ఇరాన్ చర్యల వల్ల హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి."ఇక ఆలస్యం కాకముందే ఓ ఒప్పందానికి రండి" అంటూ ట్రంప్ ఇరాన్‌కు సూచించారు. యుద్ధం నాలుగో వారానికి చేరిన నేపథ్యంలో, అవసరమైతే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లపై కూడా దాడి చేస్తామని ట్రంప్ గతంలో బెదిరించారు. అంతేకాకుండా, హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా తీసుకోదని, చమురు అవసరమైన దేశాలు తమ నౌకలను తామే రక్షించుకోవాలని లేదా అమెరికా నుంచి చమురు కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.ట్రంప్ హెచ్చరికలతో అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న ఇరాన్ చమురు ఎగుమతులపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా

**మొదటిపేజీ తరువాయి**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

## రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం

## తీవ్రంగా ఖండించిన హరీష్ రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**పతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు.ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు ' హేట్ స్పీచ్ బిల్ ' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్టాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరపున పోరాటం చేస్తూనే ఉంటమని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీకి డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

# 5 కేజీల గ్యాస్ సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం

పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా, కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని శనివారం స్పష్టం చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, అయితే దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళన చెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది.

ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలు లేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వివరించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను ఈ పద్ధతిలో విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్రం తెలిపింది. మరోవైపు, అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినట్లు పేర్కొంది.

# కేంద్ర మంత్రి కుమారస్వామికి అండగా ఉండాలి

**ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి మనమందరం అండగా నిలవాలని ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కుమారస్వామి కాపాడారని, ఆయన కేంద్ర మంత్రిగా ఉండటం మన అదృష్టమని లోకేశ్ అన్నారు. కుమారస్వామికి ఎప్పుడూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.కర్ణాటకలోని సింధనూరు హోసల్లీ క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్‌ను శనివారం లోకేశ్ ప్రారంభించారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయ



మంత్రి సంజయ్ సేథ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేశ్ ప్రసంగించారు.కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఆయన కొనియాడారు. దేశం కోసం సైనికులు చేస్తున్న ప్రాణత్యాగాలను ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు.

# దేశంలో రాజకీయ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టి పోయింది



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
దేశంలో రాజకీయ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయి, అవినీతి మయమైందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరముందని లేకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని ఆయన పేర్కొన్నారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగా సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలను ఉద్దేశించి డాక్టర్ నారాయణ మాట్లాడుతూ, రాజకీయ అవినీతిని ప్రజలకు వివరించడం ద్వారా వారిని ప్రజా ఉద్యమాల వైపు ముందుకు నడిపించేందుకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ ఉద్యమాలను నిర్వహించేందుకు కావాల్సిన వనరులను కూడా ఇందులో భాగంగా ప్రజల నుంచే సేకరిస్తున్నామని తెలిపారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అన్ని విధాలుగా భయాందోళనలకు గురువుతున్నారని, ఈ నేపథ్యంలో ఇతర రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు సైతం వెనకాడుతున్న తరుణంలో ప్రజల నుంచే విరాళాలను సేకరించడంతో పాటు ఈ దేశంలో నెలకొన్న సమస్యలను ప్రజలకు వివరిస్తున్నామని నారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్, నాయకులు బి.వెంకటేశం, ఎం.నర్సింహా, చంద్రమౌళి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్, సిపిఐజిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టుకింద శ్రీనివాస్,అటుకుల రాజు,లక్ష్మి,మదన్ సింగ్,కిష్టమ్మ కళ్యాణ్ అనిల్ , సుశాంత్ మనోజ్, భాను తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో తొలి ఏటీఎల్ సారథి అకాడమీ
## ప్రారంభించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





### వర్ధమాన్ కాలేజీలో ప్రారంభం..

**శంషాబాద్,(ప్రజావినికిడి):**
శంషాబాద్ మండల పరిధిలోని వర్ధమాన్ కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ లో రాష్ట్రంలోని మొట్టమొదటి ఏటీఎల్ సారథి మెంటర్ ఇండియా అకాడమీ'ను ఘనంగా తెలంగాణ గవర్నర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ద్వారా సాధారణ ప్రాప్తి నుండి నిరంతర భాగస్వామ్యానికి మార్పు తీసుకువచ్చి, బలమైన ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యం. ఈ విధానంలో తెలంగాణలోని అన్ని ఏ.టి.ఎల్.ఎస్ ను ప్రాంతాల వారీగా క్లస్టర్లుగా విభజించి,ప్రతి క్లస్టర్‌కు ఒక నోడల్ సంస్థను నియమిస్తారు. ఈ సంస్థలు విద్యార్థులకు నిరంతర మార్గదర్శకత్వం,



ఉపాధ్యాయులకు శిక్షణ,అలాగే ఆవిష్కరణలు, స్టార్టప్‌ల కోసం అవసరమైన మద్దతును అందిస్తాయి.. ఈ క్రమంలో వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ను తెలంగాణ రాష్ట్రానికి నోడల్ సంస్థగా ఎంపిక చేశారు. సాంకేతిక విద్య, ఆవిష్కరణలు,అదేవిదంగా వ్యాపారాభివృద్ధి రంగాల్లో ఈ సంస్థకు ఉన్న అనుభవంతో, రాష్ట్రంలోని ఏ.టి.ఎల్. పాఠశాలలకు మద్దతు ఇవ్వడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది అన్నారు. ఈ కార్యక్రమం గ్రామీణ స్థాయిలో ఆవిష్కరణలను బలోపేతం చేసి, విద్యార్థులకు భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో ముఖ్యమైన అడుగుగా నిలుస్తుంది.
ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, దేశం ముందు ఉండాలి. విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టి స్మార్ట్‌గా పనిచేయాలి. భారత్ ఒక గొప్ప దేశం,ఇక్కడ నైపుణ్యాలకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంది. మీరు దేశ భవిష్యత్,మేము వర్తమానం. వర్తమానాన్ని మంచి ఆలోచనలు, అవకాశాలతో బలోపేతం చేస్తే, భవిష్యత్ మరింత బలంగా మారుతుంది. అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రముఖులు రోమన్ సింహా సెగల్,శుభం గుప్తా,హరి చందన,దాన కిషోర్,అలాగే తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్,చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ మార్గదర్శకత్వంలోశంషాబాద్ ఎస్ హెచ్ ఓ కె. నరేందర్ రెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు సక్రమంగా నిర్వహించబడిందిఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కూడా బీజేపీ అవసరం ఎందుకు.?

**బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
భారతీయ జనతా పార్టీ స్థాపన దినోత్సవం 6=4=2026 సందర్భంగా,దేశవ్యాప్తంగా బీజేపీ ప్రయాణం,దాని సిద్ధాంతాలు,అభివృద్ధి దిశగా చేసిన కృషిని పరిశీలిస్తే- తెలంగాణలో కూడా ఈ పార్టీ అవసరం ఎందుకు అనేది స్పష్టంగా అర్థమవుతుంది.

**బీజేపీ అనేది ఒక సాధారణ రాజకీయ పార్టీ కాదు..**
ఇది జనసంఘ్ కాలం నుంచి వచ్చిన జాతీయ భావజాలానికి ప్రతీక. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ ఏకత్వం కోసం చేసిన త్యాగం,పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన "అంత్యోదయ" సిద్ధాంతం- సమాజంలోని చివరి వ్యక్తి అభివృద్ధి చెందాలి అనే భావన-ఇవే బీజేపీకి పునాది. ఈ సిద్ధాంతాలతోనే పార్టీ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, దేశ సేవను ధ్యేయంగా తీసుకుంది.
బీజేపీ ఎదుగుదల అనేది జాతీయ సమగ్రతకు ప్రతీక. ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అక్కడి ప్రజల్లో జాతీయ భావన పెరిగింది. గతంలో అభివృద్ధి లో వెనుకబడిన ఆ రాష్ట్రాలు,ఇప్పుడు మౌలిక వసతులు,ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల్లో ముందంజలో నిలుస్తున్నాయి. ఇదే విధంగా జమ్మూ కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేయడం ద్వారా దేశ అఖండత మరింత బలపడింది.

**ఒకే రాజ్యాంగం,ఒకే జెండా అనే భావనను బలపరిచింది.**
అటల్ బిహారి వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో దేశ అభివృద్ధికి బలమైన పునాది పడింది. మౌలిక వసతుల అభివృద్ధి,జాతీయ



రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలు దేశానికి దిశానిర్దేశం చేశాయి. అదే దారిలో,గత 12 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోంది. డిజిటల్ ఇండియా,మేక్ ఇన్ ఇండియా,ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాల ద్వారా దేశం స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తోంది.


**సామాజిక న్యాయం,నిమ్న వర్గాల ప్రాతినిధ్యం,మహిళా సాధికారత,యువత అభివృద్ధి**
ఈ అన్ని అంశాల్లో బీజేపీ ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. రైతుల ఆదాయం పెంపు కోసం పథకాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు సమాజంలోని ప్రతి వర్గానికి ఉపయోగపడుతున్నాయి. నక్సలిజం వంటి సమస్యలను అభివృద్ధి,భద్రతా చర్యల ద్వారా గణనీయంగా తగ్గించడం కూడా బీజేపీ పాలనలో కనిపించిన మార్పు.

**బీజేపీ ఇతర పార్టీలకు భిన్నమైన పార్టీ.**
కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండి, సాధారణ కార్యకర్తకు కూడా ఎదగడానికి అవకాశం కల్పించడం ఈ పార్టీ ప్రత్యేకత.

**క్రమశిక్షణ,సిద్ధాంతం,దేశ సేవ పట్ల నిబద్ధత - ఇవే బీజేపీని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.**
ఇలాంటి నేపథ్యంలో,తెలంగాణ రాష్ట్రంలో కూడా అభివృద్ధి, పారదర్శక పాలన,జాతీయ భావన బలపడాలంటే బీజేపీ అవసరం అనేది స్పష్టమవుతోంది. తెలంగాణ యువతకు అవకాశాలు,రైతులకు స్థిరమైన ఆదాయం,మహిళలకు సాధికారత,పరిశ్రమలకు ప్రోత్సాహం.. ఇవన్నీ సమగ్రంగా అందాలంటే బీజేపీ పాలన ఒక ప్రత్యామ్నాయం కాదు,అవసరం.

**బీజేపీ లక్ష్యం "వికసిత భారత్" నిర్మాణం.**
ప్రపంచంలో భారతమాత వైభవాన్ని పెంపొందించడం, "వసుధైవ కుటుంబకం" అనే భావనతో ప్రపంచ శాంతికి మార్గం చూపడం ఈ పార్టీ సంకల్పం. భారతీయ ఆత్మ తత్వశాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం కూడా అదే దిశలో భాగం. ఈ స్థాపన దినోత్సవం సందర్భంగా,తెలంగాణ ప్రజలు అభివృద్ధి, జాతీయ సమగ్రత, పారదర్శక పాలన కోసం ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది. బీజేపీ బలపడటం అంటే దేశం బలపడటం. అదే భావనతో తెలంగాణలో కూడా బీజేపీకి అవకాశం కల్పించడం ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లవచ్చు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన శ్రీనివాసచారి
## అభినందించిన వి హెచ్ పి నేత బండారి రమేష్



**షాద్ నగర్,(ప్రజావినికిడి),**షాద్ నగర్ పట్టణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా వేసవిలో జనాల దాహార్తిని తీర్చడం చక్కని ఆలోచన అని బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి అన్నారు. బిజెపి నాయకుడు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో పట్టణంలోని పరిగి రోడ్డు పోచమ్మ ఆలయం వద్ద చలివేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశారు. దీనిని ఆయన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు బండారి రమేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ జిల్లా నాయకుడు శ్రీనివాసచారి 2016 వ సంవత్సరం నుంచి ప్రతి వేసవిలోనూ నిరంతరంగా చలివేంద్రాలను నిర్వహిస్తూ వస్తున్నారని ప్రశంసించారు. ఒకవైపు రాజకీయాల్లో కొనసాగుతూ,మరోవైపు ప్రజాసేవ వైపు అడుగులు వేసి బాటసారులకు,ఇతర గ్రామాల నుంచి వచ్చే వారికి తాగునీరు, మజ్జిగ వంటివి అందిస్తూ వేసవిలో వారి సేద తీరుస్తున్నారని అన్నారు. ఆయన తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. యువత సేవ భావంతో ముందుకు సాగి సమాజానికి చేయూత అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు వంశీకృష్ణ,ఇస్నాతి శ్రీనివాస్,ఏలుకుర్తి నారాయణ, ఈశ్వరయ్య,సుధాకర్,శివశంకర్, రాఘవేందర్,హరీష్,చంటి, వీరప్ప,శివకుమార్,వివేక్, మణికంఠ,అభి తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో రన్ పర్ జీసస్



**వాజేడు,ఏప్రిల్ 5,(ప్రజావినికిడి):**
గుడ్ ఫ్రైడ్ సందర్భంగా,రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని వాజేడు మండల పాస్టర్స్ పెలోషిప్ బైక్ ర్యాలీని నిర్వహించారు జగన్నాధపురంలో బైక్ ర్యాలీ క్రైస్తవ మండల అధ్యక్షుడు,కట్ట భాగ్యరాజు, సెక్రటరీ తొలేం ప్రసాద్,ప్రారంభించారు ఈ ర్యాలీ



జగన్నాధపురం నుండి చెరుకూరు, వాజేడు వరకు సాగింది ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘం ట్రెజరర్ తోకల రాజు,ముప్పిరి ఆంధ్రయ్య,తోకల దాస్ సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

# పేరూరూలో ప్రజాపాలన హెల్త్ క్యాంపు

**వాజేడు,ఏప్రిల్ 5,(ప్రజావినికిడి):**
పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ సర్పంచుల సమక్షంలో డాక్టర్ తరుణ్, ఆధ్వర్యంలో 11 మందికి ఎచ్ పి వి టీకాలు వేయడం జరిగింది ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం ఒక ముందు జాగ్రత్త ఒక అడుగు. మీ బిడ్డ భవిష్యత్తుకు రక్షణ కవచం
ఈ టీకా తీసుకుందాం గర్భాశయ క్యాన్సర్ ను దూరం చేద్దాం ఎచ్ పి వి,టీకా చాలా ముఖ్యమైనది ఎందుకనగా గర్భాశయ క్యాన్సర్ రెండవ అతిపెద్ద సాధారణ క్యాన్సర్ లో ఇది ఒకటి.. దీనివలన దేశంలో 42 వేల మంది



చనిపోయినారు. ఈ టీకా ముఖ్యంగా బాలికలలో గర్భాశయ క్యాన్సర్లు రాకుండా నివారించగలదు అని వైద్యులు తెలిపారు
ఈ కార్యక్రమంలో పేరూరు పంచాయతీ సర్పంచ్ గొడ్డె సరోజిని, కృష్ణాపురం సర్పంచ్ పూణెం విజయబాబు, టేకులగూడెం సర్పంచ్ చిడెం



బాలకృష్ణ,చంద్రు పట్ల సర్పంచ్ అనుముల సంధ్యారాణి, పేరూరు పంచాయతీ వార్డు మెంబర్ శరత్, ఎచ్ఈఓ వేణుగోపాలకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ రమాదేవి,ఎఎన్ఎం. శకుంతల, శ్రీదేవి, సుమలత,శారదా రాజ్యలక్ష్మి ఎచ్వి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీశ్రీశ్రీ పోచమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గనగర్ కాలనీ నందు ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మతల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా చంపాపేట డివిజన్ సీనియర్ భారస నాయకులు చీర శ్రీనివాస్ ఆహ్వానం మేరకు శనివారం రోజు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీదేవిరెడ్డి సుధీర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,దేవాలయం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు : అవకతవకలు వెలుగులోకి..






**ఉప్పల్,(ప్రజావినికిడి):** హైదరాబాద్‌లోని ఉప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది హాజరులో లోపాలు,సిటిజన్ ఛార్టర్ లేకపోవడం, ఆర్టీఐ బోర్డు దెబ్బతినడం వంటి పలు అవకతవకలు బయటపడ్డాయి.
అక్రమ రిజిస్ట్రేషన్లు, నియమావళి ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ప్రజలు అనుమానాస్పద అంశాలను 14432కు ఫోన్ చేసి సమాచారం అందించాలని విజిలెన్స్ అధికారులు కోరారు. ఈ సంఘటన ఉప్పల్, అంబర్‌పేట్ ప్రాంతాల్లో కలకలం రేపింది...

# చీకటిపై వెలుగుజయం

## ఈస్టర్ పండుగ ప్రత్యేకం



ప్రపంచ క్రైస్తవుల ఆధ్యాత్మిక జీవనంలో అత్యంత ప్రాముఖ్యమైన పండుగగా ఈస్టర్ నిలుస్తోంది. యేసుక్రీస్తు సిలువపై మరణించిన మూడవ రోజున పునరుత్థానం పొందిన సందర్భాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ, ఆశ, విశ్వాసం, పునర్జన్మకు ప్రతీకగా భావించబడుతుంది. మానవాళికి ప్రేమ, క్షమ, త్యాగం వంటి విలువలను బోధించిన యేసుక్రీస్తు జీవితం ఈస్టర్ సందేశానికి పునాది.
ఈస్టర్‌కు ముందు వచ్చే గుడ్ ఫ్రైడే రోజున యేసుక్రీస్తు సిలువపై మరణించిన ఘట్టాన్ని స్మరించుకుంటారు. ఆ రోజు భక్తులు ఉపవాసాలు పాటిస్తూ, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ, సిలువ మార్గ యాత్రల్లో పాల్గొంటారు. యేసు అనుభవించిన వేదనలను గుర్తుచేసుకుంటూ ఆత్మపరిశీలనకు సమయం కేటాయిస్తారు. అనంతరం వచ్చే ఆదివారం ఈస్టర్ పండుగగా ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. జిల్లా కేంద్రాల నుంచి గ్రామాల వరకు చర్చిలన్నీ ఈస్టర్ వేడుకలతో కళకళలాడుతున్నాయి. తెల్లవారుజామునే ప్రార్థనలతో ప్రారంభమైన వేడుకలు భక్తి పరవశాన్ని కలిగిస్తున్నాయి. గీతాలాపనలు, బైబిల్ వచనాల పఠనం, ప్రత్యేక ప్రార్థనలు భక్తులను ఆధ్యాత్మికంగా ఉల్లాసపరుస్తున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి ప్రత్యేక విందులు ఏర్పాటు చేసుకుని పండుగను సంతోషంగా జరుపుకుంటున్నారు. ఈస్టర్ పండుగలో భాగంగా పిల్లలు రంగురంగుల ఆడుకోవడం, అలంకరణలు చేయడం వంటి సంప్రదాయాలు కూడా కనిపిస్తున్నాయి. ఈస్టర్ కొత్త జీవనానికి ప్రతీకగా భావించబడుతుంది. కొన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు సహాయం చేయడం ద్వారా యేసు బోధించిన ప్రేమ, సేవా భావాన్ని ఆచరణలో చూపిస్తున్నారు.
ఈస్టర్ సందేశం మానవ సమాజానికి ఎంతో ప్రాధాన్యత కలిగింది. ద్వేషం, అసూయలను విడిచిపెట్టి ప్రేమతో జీవించాలని, క్షమాగుణాన్ని అలవరచుకోవాలని ఈ పండుగ సూచిస్తుంది. విభేదాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సందేశం మరింత అవసరంగా మారింది. వ్యక్తిగతంగా కూడా మనలోని చెడు అలవాట్లను వదిలి, కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని ఈస్టర్ ప్రేరేపిస్తుంది. మొత్తంగా ఈస్టర్ పండుగ చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తోంది. నిరాశలో ఉన్నవారికి ఆశను నింపుతూ, జీవితంలో కొత్త ఆరంభానికి దారితీస్తోంది. ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం వంటి విలువలను బలపరుస్తూ సమాజాన్ని ఒకటిగా కట్టిపడేసే మహత్తర పండుగగా ఈస్టర్ నిలుస్తోంది.

# అక్రమ నిర్మాణం కూల్చివేత..





**ప్రజావినికిడి (కాప్రా):**
కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వంద్వ వైఖరి బహిర్గతం అయ్యింది. చేసే ఉద్యోగం కంటే లంచాలకే ప్రాధాన్యత ఇచ్చారన్న వాస్తవం అక్రమ నిర్మాణం కూల్చివేతలు తేటతెల్లమయింది.
చర్లపల్లి ప్రాంతంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత వ్యవహారం మరోసారి కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై తీవ్రమైన అనుమానాలను రేకెత్తిస్తోంది. నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్న అధికారులే పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కూల్చివేత పేరుతో నామమాత్రంగా గోడలకు రంధ్రాలు వేయడం కిటికీలు తీయడం చేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అమ్మో కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇలానా.?

చర్లపల్లిలో రహదారిపై ఇంటి నెంబర్ 2-10-24,25 అక్రమంగా నిర్మించిన భవనంపై అధికారులు రెండుసార్లు సీజ్ చేసినట్లు తెలిపారు. వాస్తవానికి అది కేవలం పైపై చర్యగానే మిగిలిందని తిరిగి యధావిధిగా నిర్మాణం జరుగుతుంటే ఒక్క అధికారి కూడా ఇటువైపు చూడకపోవడం వెనుక మామూలే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.
భవనం పూర్తిగా కూల్చివేయాల్సిన చోట కొన్ని గోడలకు చిన్న రంధ్రాలు వేసి వదిలివేయడం, కిటికీలు తీయడం మాత్రమే తొలగించి,మిగతా




నిర్మాణాన్ని అలాగే వదిలేయడం అధికారుల నిజమైన అవినీతి ఉద్దేశ్యం తెలిసిందని స్థానికులు పేర్కొంటున్నారు. అనేక పత్రికల్లో వరుస కథనాలు వెలువడిన తర్వాతే అధికారులు కదిలారని అదేవిధంగా హై కోర్టులో కంటెంట్ పిటిషన్ పై విచారణ ఉండడంతో తప్పని పరిస్థితుల్లో తూతూ మంత్రంగా కూల్చినట్లు ప్రజలు చెబుతున్నారు. అయితే హైకోర్టులో ఉన్న ఈ అక్రమ నిర్మాణానికి అసెస్మెంట్ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి అక్రమ నిర్మాణానికి ఇలా అసెస్మెంట్ చేశారో అవినీతి అధికారులకే తెలియాలి. మామూళ్లు తీసుకున్నాకే ఈ విధంగా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు అంటూ స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి పెచ్చరిల్లిందని, మున్సిపల్ నియమ నిబంధనలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన సెక్షన్ ఆఫీసర్ తుల్జాసింగ్ పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన కాప్రా సర్కిల్ కు వచ్చినప్పటినుండి భారీగా అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తూ లంచాలే పరమ అవధిగా ఉద్యోగం చేస్తున్నట్లు, ప్రైవేటు వ్యక్తులను పెట్టుకొని మరీ దోపిడీకి తెగబడ్డ తీరుపై తోటి ఉద్యోగులు సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. ఆయన అనుమతి లేకుండా ఏ ఒక్క అక్రమ నిర్మాణం కూడా జరగవని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవైపు పేదలు ఇల్లు నిర్మిస్తే చిన్నపాటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటూ, మరోవైపు భారీ అక్రమ నిర్మాణాలపై మౌనం వహించడం అధికారుల ద్వంద్వ వైఖరిని స్పష్టంగా చూపుతోందిని స్థానికులు పేర్కొంటున్నారు. జోనల్ కమిషనర్ స్థాయిలో ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించకపోవడం కూడా విమర్శలకు తావిస్తోంది.

### అధికారుల అవినీతి తగ్గేనా.?

కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలపై వస్తున్న ఆరోపణల్లో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా,ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కఠినంగా వ్యవహరించాలని
చర్లపల్లిలో జరిగిన ఈ అక్రమ నిర్మాణమే ఒక ఉదాహరణ మాత్రమే. పట్టణ అభివృద్ధి పేరుతో జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాలంటే అధికారుల నిజాయితీ కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరం. లేదంటే ప్రభుత్వ ఉద్యోగం కంటే అవినీతికే అధికారుల ప్రాధాన్యత అన్న ప్రజల అభిప్రాయం మరింత బలపడే ప్రమాదం ఉంది. కాబట్టి కమిషనర్ కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి పల్లకీ సేవ





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ,జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు, ప్రమోద్,సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పట్టణానికి చెందిన లక్కిరెడ్డి వెంకటరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన లక్కిరెడ్డి వెంకటరెడ్డి ని పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పట్టణానికి చెందిన త్రిశూల్ రెడ్డి,గౌతమి దంపతులు దేవాలయ అభివృద్ధికి 1000 రూపాయల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, ఎంసాని నర్సింలు, జి.వసంతరావు,బాలనగర్ అనంతరెడ్డి,అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్,శంకర్ గౌడ్,కే వీరేంద్ర చారి,లక్ష్మారెడ్డి, యాదగిరి,తులసి రామ్, రఘునందన్ రెడ్డి,సుప్ప నర్సింలు, నారాయణ,వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య,వీఆర్వో బచ్చన్న,సుప్ప కృష్ణయ్య,పి.ప్రవీణ్ గౌడ్,పద్మా వెంకటేష్,జగన్,గోరియా నాయక్,కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్,రమేష్,రవి,హనుమంత్ రెడ్డి,రవీందర్, నరసింహులు,మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య,భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల లెక్కలు తేల్చాల్సిందే : మాజీ ఎంపీ హనుమంత రావు..

### బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి..
### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కేంద్ర ప్రభుత్వం చేపట్టదలచిన డిజిటల్ సెన్సెస్ ప్రక్రియపై మాజీ రాజ్యసభ సభ్యుడు వీహెచ్ హనుమంత రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో దేశంలో కుల గణన నిర్వహించే సమయంలో కేవలం ఎస్సీ,ఎస్టీల వివరాలు మాత్రమే సేకరిస్తూ ఓబీసీలను విస్మరించడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఓబీసీలు కూడా దారిద్ర్యరేఖకు దిగువన మగ్గుతున్నారని,వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులతో కూడిన వివరాలను సేకరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేవలం హిందువుల ఓట్లతో గెలవాలని చూస్తున్న బీజేపీకి, ఓబీసి ప్రయోజనాలు పట్టవా అని ఆయన నిలదీశారు. ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,బీసీ లు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ ఫలాలు అందాలంటే రాజ్యంగ బద్దంగా రిజర్వేషన్ సాధించాల్సిన అవసరం ఉండాలని పేర్కొన్నారు. అన్ని బిసి సంఘాలు సంఘటితంగా పని చేస్తేనే మన హక్కులను సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్,విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవి,ఇతర బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ శాంతి కోసం,ఇరాన్ పై, అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం.

**యుద్ధ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి. -షాద్ నగర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రం విడుదల.**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఇజ్రాయిల్ అమెరికా దేశాలు ఇరాన్ మీద ఆక్రమణ యుద్ధం ప్రారంభించి ప్రపంచ ప్రజల జీవితాలతో చెలగట మాడుతున్నాయని సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచ ప్రజల శాంతి కోసం జరిగే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం నాడు షాద్ నగర్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విడుదల చేశారు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు కోరారు అమెరికా ఇజ్రాయిల్ దేశాలు వనరుల దోపిడి కోసం ప్రపంచం మీద ఆధిపత్యం కోసం పాఠశాలల మీద ఆసుపత్రుల మీద జనావాసాల మీద దాడులు చేస్తున్నాయని అవి యుద్ధాన్ని ప్రాణాంతక సమస్యగా విధ్వంసంగా ఒక సరదా క్రీడలాగా భావిస్తున్నాయని ఇజ్రాయిల్ పాలస్తీలను ఊచకోత కోసిందని దానికి అమెరికా మద్దతు ఇస్తుందని ఇప్పుడు ఈ రెండు దేశాలు కలిసి ఇరాన్ మీద దాడికి దిగాయని ఇది మూడు దేశాల ముచ్చట కాదు ఇంకోవైపున రష్యా ఉక్రెయిన్ మీద యుద్ధం చేస్తుందని యావత్తు ప్రపంచ బీభత్స పర్యవసనాలు అనుభవించక తప్పని పరిస్థితి యుద్ధోన్మాద దేశాలు కల్పిస్తున్నాయని ఈ యుద్ధాలను వ్యతిరేకించవలసిన భారత ప్రభుత్వం ఎందుకు వెనుకబడి పోతుందని ఇజ్రాయిల్ పాలస్తినా మీద హింసకాండను ఇరాన్ మీద అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్నటువంటి హింసకాండను భారత ప్రభుత్వం ఎందుకు ఖండించడం లేదని నిలువరించే కృషి ఎందుకు చేయలేకపోతుందని యుద్ధ ప్రభావం ప్రపంచ ప్రజలపై ఏవిధంగా ప్రభావం చూపిస్తుందో తదితర అంశాలను చర్చించడానికి మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే సదస్సు కు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు ఇరాన్ భారత సంబంధాలు చారిత్రక పరిశీలన అనే అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం రాజకీయ ఆర్థిక నేపథ్యమైన అంశంపై సైబాబ మరియు సామాజిక సంబంధాలపై యుద్ధం ప్రభావం అనే అంశంపై ప్రొఫెసర్ విజయ్ యుద్ధం ఆర్థిక పర్యవసనాలు భవిష్యత్తు అనే అంశంపై రాఘవచారి హాజరై ప్రసంగిస్తారని ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ప్రజా సంఘాల నాయకులు టీజీ. శ్రీనివాస్,పాలమూరు అధ్యయన వేదిక నాయకులు రవీంద్రనాథ్,యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు,యూటీఎఫ్ నాయకులు,బిజిలి సత్యం,వలిగే కృష్ణ,పౌర హక్కుల సంఘం నాయకులు తిరుమలయ్య,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యులు మిద్దెల సత్యనారాయణ,గిరిజన సంఘం నాయకులు ఈశ్వర్ యూటిఎఫ్ నాయకులు బాలయ్య,కృష్ణయ్య, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

## వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు

## ట్రాఫిక్ ఎస్ఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం





**పెద్దపల్లి, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**
డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు వేసిన ఒక మాస్టర్ ఎ÷--లాన్ డైరెక్టుగా పోలీసులకే దొరికిపోయింది. పోలీసులు ఎక్కడెక్కడ చెకింగ్ చేస్తున్నారో ముందే సమాచారం తెలుసుకునేందుకు వారు ఏకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే, ఆ గ్రూప్‌లోకి నేరుగా ట్రాఫిక్ ఎస్ఐ ఎంట్రీ ఇవ్వడంతో మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. గోదావరిఖని ప్రాంతంలో కొంతమంది మందుబాబులు కలిసి 'పోలీస్ మామల స్క్వాడ్' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించారు. కేవలం ఇద్దరితో మొదలైన ఈ గ్రూప్, చూస్తూనే వేల మంది సభ్యులకు చేరుకుంది. ఈ గ్రూప్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే.. పట్టణంలో ఎక్కడైనా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుంటే, వెంటనే ఆ లొకేషన్ వివరాలను గ్రూప్‌లో షేర్ చేయడం. దీనివల్ల మందుబాబులు ఆ మార్గాల్లో వెళ్లకుండా ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుని పోలీసుల కళ్లు గప్పేవారు. ఇటీవల వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని సెల్ ఫోన్ తనిఖీ చేయగా ఈ వింత వాట్సాప్ గ్రూప్ వ్యవహారం బయటపడింది. ఆ గ్రూప్‌లోని మెసేజ్‌లను చూసిన స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ, వెంటనే అందులో ఒక సెల్ఫీ వీడియోను పోస్ట్ చేశారు. 'అరేయ్ మామ.. నేను ట్రాఫిక్ ఎస్ఐని రా మామ.. నా మీదే గ్రూప్ పెడతారా?' అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసుకుందాం' అని సవాల్ విసిరారు.ఆ వీడియోను చూసిన మందుబాబులు ఒక్కసారిగా హడలిపోయారు. వెంటనే గ్రూప్ నుండి లెఫ్ట్ అవ్వడం ప్రారంభించారు. అయితే ఎస్ఐ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా.. 'ఎవరూ వెళ్ళిపోకండి, మీ అందరి నెంబర్లు సేవ్ చేసుకున్నాను, ఫోటోలు కూడా తీశాను. మీ అందరికీ త్వరలోనే ఒక స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ పెడతాను, అందరూ రండి' అని అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. మందుబాబుల 'స్మార్ట్ ప్లాన్' పోలీసుల చేతికి చిక్కడంతో ఇప్పుడు గోదావరిఖనిలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని మరీ మందుబాబుల ఆట కట్టించడంతో, ఇప్పుడు ఆ గ్రూప్‌లో ఉన్న సభ్యులంతా పోలీసులకు ఎక్కడ దొరికిపోతామో అని బిక్కుబిక్కుమంటున్నారు.

------------

# తంగేలపల్లిలో శ్రీ నంధీశ్వర,ధ్వజస్తంభ ప్రతిస్థాపన మహోత్సవాలు

## ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్న: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలంలోని తంగెలపల్లి గ్రామంలో శివాలయంలో శ్రీ నందీశ్వర ధ్వజస్తంభం ప్రతిష్టాపన మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, హిందూ దేవాలయాలలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన అత్యంత పవిత్రమైనదని, ఇది ఆలయ నిర్మాణంలో వెన్నెముక వంటిదని దైవశక్తిని ఆలయంలోకి ఆకర్షించి,భక్తులకు దైవదర్శనం ముందు సూచనగా నిలుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్,మాజీ జెడ్పిటిసి తనయుడు రామకృష్ణ మహాదేవపూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి,ఉమెంతాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి,విశ్వనాథ్ పూర్ సర్పంచ్ శ్రీలత రాములు,ఉత్తరాస్ పల్లి సర్పంచ్ నందు,ఉపసర్పంచ్ హలీం బాయ్,మాజీ సర్పంచులు బాల్ రాజ్,గోపాల్ నాయక్,వెంకటేష్,జనార్దన్ గౌడ్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు జగదీష్ శ్రీశైలంగౌడ్,రవీందర్ గౌడ్,నర్సిములు,పెర్మల్ రెడ్డి, పులిందర్ రెడ్డి,నగేష్ ప్రవీణ్,హన్మంత్,యాదయ్య, వెంకటేష్,క్రిష్ణ బండి శేఖర్,కొత్త బాల్ రాజ్,చెంద్రయ్య,శ్రీను,శ్రీకాంత్ గౌడ్, యాదగిరి,సిహెచ్ రాము,బాగల్ల రాములు,కబీర్ దాస్,గణేష్ నగేష్,క్రిష్ణ,ప్రశాంత్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రూ.50 లక్షల విలువైన గంజాయితోపాటు, రూ.72,500 నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయానికి యత్నించిన నలుగురిని అరెస్టు చేశారు. తుని నుంచి రైలులో హైదరాబాద్, ముంబయికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు





**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**హైదరాబాద్ నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ కొరడా ఝళిపించింది. ఆరు జోన్లలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలు, షెడ్లను జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. జాంబాగ్ వద్ద ఆక్రమణల తొలగింపు చర్యలను కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పరిశీలించారు. అత్తాపూర్ సర్కిల్ వద్ద రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతను అధికారులు చేపట్టారు. ఆరాంఘర్ నుంచి డెయిరీ ఫామ్ చౌరస్తా వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. పోలీసులతో యజమానులు వాగ్వాదానికి దిగడంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# ప్రపంచ ఆరోగ్యానికి ప్రకృతి అందించిన అద్భుత వరం

**: సహజసిద్ధమైన 'సంజీవిని' చేదు ఆకు! బిట్టర్ లీఫ్ !**



నేటి కాలంలో మధుమేహం, కాలేయ సమస్యలు మరియు వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం ప్రతి ఇంటా సాధారణమైపోయాయి.ఈ సమస్యలకు ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారాలు ఉన్నాయి.తమ జీవితాన్ని అరుదైన వనమూలికల పరిశోధనకు మరియు వెలికితీతకు అంకితం చేశారు, వైద్యులు సింహాచలం లక్ష్మణ స్వామి. వారి అపారమైన కృషి ఫలితంగా, నేడు ప్రపంచానికి ఒక గొప్ప ఔషధ గనిని పరిచయం చేస్తున్నారు.

### మొక్క పరిచయం:

ఈ మొక్క సాధారణ నామం చేదు ఆకు. వాడుకలో దీనిని కట్టు సంజీవి లేదా కాటు సంజీవి అని కూడా పిలుస్తారు. వృక్షశాస్త్రంలో దీని శాస్త్రీయ నామం వెర్నోనియా అమిగ్డాలినా. దీని ఆకులు విపరీతమైన చేదును కలిగి ఉన్నప్పటికీ, ఇవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అమృతంలా పనిచేస్తాయి. ప్రకృతిలో దాగి ఉన్న ఈ అరుదైన వనమూలికను ప్రజల ముందుకు తీసుకురావడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నాము.

### చేదు ఆకు అద్భుత ప్రయోజనాలు:

మధుమేహ నియంత్రణ: రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. భోజనం చేసిన తర్వాత చక్కెర పెరగకుండా నియంత్రించడంలో ఇది సహజసిద్ధమైన ఔషధంలా ఉపయోగపడుతుంది.

**కాలేయ రక్షణ:** మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవమైన కాలేయాన్ని రక్షించడంలో ఈ చేదు ఆకు ముందుంటుంది. కాలేయ కణాలను రక్షించి, కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది మరియు శరీరాన్ని శుద్ధి చేస్తుంది.

**రోగనిరోధక శక్తి వృద్ధి:** ఇందులో పుష్కలంగా ఉన్న జీవసత్వాలు మరియు ఖనిజ లవణాలు శరీర వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయి.

**జీర్ణక్రియ మరియు పేగుల ఆరోగ్యం**: ఆకలిని పెంచి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కడుపులోని హానికరమైన పురుగులను (పరాన్నజీవులను) నాశనం చేస్తుంది.

**చర్మ మరియు కేశ సంరక్షణ:** ముడతలు, మచ్చలు తగ్గించి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. జుట్టు రాలడం మరియు చుండ్రు సమస్యలను అరికడుతుంది.


### వాడే విధానం:

ఈ మొక్కను వాడటం చాలా సులభం. దీనిని రెండు విధాలుగా తీసుకోవచ్చు:

**నేరుగా నమలడం:** రోజూ ఉదయం పరగడుపున ఒకే ఒక చేదు ఆకును నేరుగా నమలడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు పొందవచ్చు.

**కషాయం రూపంలో:** గుప్పెడు ఆకులను నీటిలో సగం అయ్యేవరకు మరిగించి, కషాయం లాగా తయారుచేసి త్రాగవచ్చు. చేదుగా అనిపిస్తే కొద్దిగా తేనె కలుపుకొని తీసుకోవచ్చు.
మోతాదు మరియు వాడే విధానం గురించి మరింత స్పష్టమైన సమాచారం కోసం ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం అంతర్జాల దృశ్య వేదిక (యూట్యూబ్ ఛానల్) ను సందర్శించండి.ఈ మొక్క గొప్పదనం, వాడే విధానం, మోతాదు మరియు జాగ్రత్తల గురించి వైద్యులు సింహాచలం లక్ష్మణ స్వామి సవివరంగా దృశ్యమాధ్యమం ద్వారా వివరించారు.ఈ అరుదైన విషయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాము.

మరిన్ని చిత్రాల కోసం ఈ QR స్కాన్ చెయ్యండి



ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం
వ్యవస్థాపక అధ్యక్షులు,
వైద్యులు సింహాచలం లక్ష్మణ స్వామి..

# పొంగులేటి మైనింగ్ స్కామ్ దృష్టి మళ్లింపు

## అందుకే తనపై సిఐడి విచారణ

## హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి




**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి)::** ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసు విధులకు భంగం కలిగించడం, రెచ్చగొట్టే వాఖ్యలు చేసిన కేసులో.. కౌశిక్ రెడ్డి శనివారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ అనంతరం ప్రభుత్వం, పోలీసులపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని రాజకీయంగా వేధించడానికి ఈ విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐడీ కార్యాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేను దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని అన్నారు.

-----

# గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

**ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**
రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు



వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సూాద్యం కాగలదు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

## బావలోకి దూసుకెళ్లిన కారు

## ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి

**ముంబై, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**
మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

-------------

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

## కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు

## బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు

**వరంగల్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు-66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

# సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

## ఇది హిందీని రుద్దే కార్యక్రమంగా ఉంది -తమిళనాడు సిఎం స్టాలిన్ అభ్యంతరం

**చెన్నై ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):**
2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుండి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సిబిఎస్ఇ తాజాగా ప్రకటించింది. త్రిభాషా విధానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ భాషల కంటే హిందీకి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడానికి, ఆ భాషను బలవంతంగా రుద్దడానికి చేసే ప్రయత్నమేనని ఆయన మండిపడ్డారు. ఈ విధానం సమాఖ్యవాదాన్ని దెబ్బతీస్తుందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలను అణచివేస్తుంది. పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని మోపుతుందని స్టాలిన్ ఆరోపించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని, రాష్ట్రాలవ్యాప్తంగా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యార్థులు మూడు భాషల్ని చదవాలని తెచ్చిన కొత్త పాఠ్యప్రణాళిక విధానం నిష్కపటమైన విద్యా సంస్కరణ కాదు. ఇది హిందీని బలవంతంగా రుద్దాలని ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నం. ఇది బిజెపి హిందీని మాపై బలవంతంగా రుద్దుతుంది అన్న ఆందోళనల్ని నిజం చేస్తుంది. భారతీయ భాషలను ప్రోత్సహించే ముసుగులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారతదేశపు గొప్ప, వైవిధ్యభరితమైన భాషా వారసత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తూ, హిందీని ప్రాధాన్యతనిచ్చే కేంద్రీకరణ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. మూడు



భాషల సూత్రం అని పిలిచేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాలలోకి హిందీని విస్తరించడానికి ఉద్దేశించిన ఒక రహస్య యంత్రాంగం. కేంద్ర ప్రభుత్వ పాఠ్య ప్రణాళిక విధానం హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యతనిస్తుంది. నిష్పక్షపాతాన్ని, సమాఖ్యవాదాన్ని, ప్రాంతీయ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇలాంటి విధానాలు భారతదేశ భాషా వైవిధ్యానికి ముప్పు కలిగిస్తాయని స్టాలిన్ హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రాంతీయ గుర్తింపు కోసం నిలబడాలని తమిళనాడులోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆయన పిలుపునిచ్చారు. ÷-రిభాషా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులను హిందీని నేర్చుకోవడం తప్పనిసరి చేస్తుంది. మరి హిందీ మాట్లాడే రాష్ట్రాల విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకుంటారా? దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు మధ్య నేర్చుకునే విధానంలో స్పష్టత లేదు. ఈ విధానం ఏకపక్షంగా హిందీని రుద్దడమనే వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతుంది. ఈ వైరుధ్యం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో విఫలమైంది. తమిళ భాషను బోధించడానికి తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. మరి ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇది భాషల పట్ల కేంద్రం చూపే వైఖరి నిబద్ధత కాదు.. పచ్చి కపటత్వం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ధ్వజమెత్తారు. మిళనాడు అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తి చట్టబద్ధమైన, స్థిరమైన ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ విధానం సహకార సమాఖ్యవాద సూత్రాలకు విరుద్ధం. లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపు అవమానించడమే అని స్టాలిన్ అన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరు పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని అంగీకరిస్తాయా? లేక ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్తు కోసం నిలబడతాయా? అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు.

# ఒంటిమిట్టలో నేత్రపర్వంగా చక్రస్నానం



**ఒంటిమిట్ట, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి)::** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుండి 11.15 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# ఆందోళన కలిగిస్తున్న గ్యాస్ కొరత

## సంక్షోభంతో హోటళ్లు, పరిశ్రమ కుదేలు -సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

**పల్నాడు, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి)::**దేశవ్యాప్తంగా గ్యాస్, ఆయిల్ రంగాలలో ఏర్పడిన సంక్షోభం సాధారణ ప్రజలపై భారంగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి, రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ విస్తరించిందని, చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు గ్యాస్ సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.జీవనోపాధి కోల్పోయిన యువకులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధికారులు మార్కెట్లో గ్యాస్ అందుబాటులో ఉందని చెబుతున్నా, వాస్తవానికి అది సామాన్య ప్రజలకు అందడం లేదని విమర్శించారు. కృష్ణా-గోదావరి బేసిన్‌లో పుష్కలంగా గ్యాస్ వనరులు ఉన్నప్పటికీ,



ప్రైవేట్ కంపెనీలు రోజుకు సుమారు 21 వేల టన్నుల గ్యాస్‌ను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాయని, రాష్ట్రానికి మాత్రం సరిపడా సరఫరా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరం రోజుకు కేవలం 4 వేల టన్నులే అయినప్పటికీ, ఆ అవసరాన్ని కూడా తీర్చకపోవడం అన్యాయమని అన్నారు. దీనివల్ల విదేశాల నుంచి అధిక ధరలకు గ్యాస్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారని పేర్కొన్నారు. కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్‌ను స్థానికంగా పైప్‌లైన్‌ల ద్వారా పీఎన్‌జీగా సరఫరా చేస్తే, గృహాలకు తక్కువ ధరకే గ్యాస్ అందుబాటులోకి వస్తుందని, ఇది సామాన్య ప్రజలకు, చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట కలిగిస్తుందని వివరించారు. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, రాష్ట్రానికి న్యాయమైన గ్యాస్ వాటాను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మా గ్యాస్-మా హక్కు' నినాదంతో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొదటిగా రాజమండ్రిలో భారీ ప్రజాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# రాష్ట్రేతర ఓటర్లకు ప్రభుత్వం శుభవార్త

## ఓటేయడానికి వెళ్లే ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

**హైదరాబాద్, ఏప్రిల్ 4 (ప్రజావినికిడి):::**ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరిగే ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు.. ఆయా రాష్ట్రాలకు చెందిన వారై ఉండి తెలంగాణలో నివసిస్తున్న ఓటర్ల కోసం ప్రత్యేక సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక , ఉపాధి శాఖ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు , పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఎవరైతే తెలంగాణలో ఉద్యోగ రీత్యా లేదా ఇతర పనుల నిమిత్తం స్థిరపడ్డారో.. వారందరికీ తమ సొంత రాష్ట్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ
ఆదేశాల ప్రకారం.. ఈ సెలవు కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగాలకు కూడా వర్తిస్తుంది. రాష్ట్రంలోని అన్ని రకాల ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, ఇతర సంస్థలలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు, ఉద్యోగులకు పోలింగ్ రోజున 'పెయిడ్ హాలిడే' ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఓటు వేయడానికి వెళ్లే ఉద్యోగుల జీతంలో ఎటువంటి కోత విధించకూడదని యాజమాన్యాలకు సూచనలు జారీ అయ్యాయి. అసోం, కేరళ మరియు పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఓటర్ల కోసం ఏప్రిల్ 9వ తేదీన సెలవు ప్రకటించారు. తమిళనాడు ఓటర్ల కోసం ఏప్రిల్ 23వ తేదీన ప్రత్యేక సెలవు వర్తించనుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతున్నందున, అక్కడి ఓటర్ల కోసం ఏప్రిల్ 23 మరియు ఏప్రిల్ 29 తేదీల్లో సెలవులను కేటాయించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



# స్వదేశానికి వెళ్లిన సన్‌రైజర్స్ ఆటగాడు ప్యాట్ కమిన్స్

పాట్ కమిన్స్ గత కొంతకాలంగా వెన్నునొప్పితో సతమతమవుతున్నాడు. ఈ గాయం కారణంగానే ఆయన గతేడాది యాషెస్ సిరీస్‌తో పాటు టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే తాను మొదటి సగం మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనని కమిన్స్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో బరిలోకి దిగేందుకు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు నుంచి అనుమతి లభించలేదు. దీంతో తుది స్కాన్, ఫిట్‌నెస్ క్లియరెన్స్ కోసం ఆయన స్వదేశానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో హైదరాబాద్ జట్టుకు భారీ షాక్ తగలనుంది. కమిన్స్ గైర్హాజరీలో విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో హైదరాబాద్ ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో ఓడిపోయినప్పటికీ, రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 65 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి ఫామ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉన్న హైదరాబాద్, తన తదుపరి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. కమిన్స్ తిరిగి వచ్చే వరకు కిషనే జట్టును నడిపించనున్నాడు. తాజా సమాచారం ప్రకారం, ఆస్ట్రేలియాలో జరిగే వైద్య పరీక్షల్లో కమిన్స్ ఫిట్‌గా ఉన్నట్లు తేలితేనే ఆయన తిరిగి భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ 17 నాటికి ఆయన మళ్ళీ జట్టుతో కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ స్కాన్ నివేదికలు ప్రతికూలంగా వస్తే, ఈ సీజన్ మొత్తానికి ఆయన దూరం కావచ్చు. కమిన్స్ లేని పక్షంలో జట్టులో విదేశీ ఆటగాళ్లుగా ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ మలింగ వంటి వారు కీలకం కానున్నాడు. పాట్ కమిన్స్ కేవలం అద్భుతమైన బౌలర్ మాత్రమే కాదు, చతురత కలిగిన నాయకుడు కూడా. గత సీజన్‌లో జట్టును ముందుండి నడిపించిన ఆయన అనుభవం ఇప్పుడు సన్‌రైజర్స్‌కు ఎంతో అవసరం. అయితే ఇషాన్ కిషన్ నాయకత్వంలో యువ ఆటగాళ్లు రాణిస్తుండటం జట్టుకు సానుకూల అంశం. రేపు రాజీవ్ గాంధీ స్టేడియంలో లక్నోతో జరిగే మ్యాచ్‌లో హైదరాబాద్ విజయం సాధించి పాయింట్ల పట్టికలో ముందుకు వెళ్లాలని పట్టుదలగా ఉంది.

# నువ్వే చెప్పు నేను ఓవర్సీస్ ప్లేయర్‌నా...

**• నాగ్స్‌ను రివర్స్‌లో ప్రశ్నించిన విరాట్**



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఏ జట్టైనా అత్యధికంగా నలుగురు ఓవర్సీస్ (ఫారిన్) ప్లేయర్లతోనే బరిలోకి దిగాలి. అంతకంటే ఒక్క ప్లేయర్‌ను కూడా మ్యాచ్‌లో ఆడేందుకు అనుమతించరు. ఐపీఎల్‌లో ఫారిన్ ప్లేయర్ల విషయంలో ఉన్న నిబంధన ఇది. ఈ రూల్ తొలి సీజన్ నుంచే కొనసాగుతూ వస్తోంది. అయితే ప్రస్తుత సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మాత్రం ఐదుగురు ఓవర్సీస్ ప్లేయర్లతో ఆడుతోందని సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. దీనిపై బెంగళూరు కమెడియన్ మిస్టర్ నాగ్స్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని వివరణ అడిగాడు. కొంతకాలంగా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టీమ్‌ఇండియాకు మ్యాచ్‌లు లేని సమయంలో లండన్‌కు వెళ్లిపోతున్నాడు. అతడు కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నాడు. భార్య అనుష్క శర్మ, పిల్లలతో కలిసి విరాట్ లండన్ వీధుల్లో చక్కర్లు కొడుతున్న వీడియోలు సైతం అప్పుడప్పుడు సోషల్ మీడియాలో వస్తుంటాయి. దీంతో విరాట్ ఎక్కువగా సమయం లండన్‌లోనే గడుపుతుండడంతో అతడు ఓవర్సీస్ ప్లేయర్ అయిపోయాడంటూ ఫ్యాన్స్ ఫన్నీగా మీమ్స్ చేస్తున్నారు. అందుకే ఆర్సీబీ ఐదుగురు ఓవర్సీస్ ప్లేయర్లతో బరిలోకి దిగుతుందంటూ సెటైర్లు పేలుస్తున్నారు. దీని గురించే ఆర్సీబీ ఇన్‌సైడర్ షో లో విరాట్‌ను నాగ్స్ అడిగాడు. 'ఆర్సీబీ టీమ్ ఐదుగురు ప్లేయర్లతో ఆడుతుందని నెటిజన్లు అంటున్నారు. వాళ్లు అలా ఎందుకు అంటున్నారో నాకు అర్థం కావడం లేదు. వాళ్లు ఏం చెప్పాలనుకుంటున్నారు' అని నాగ్స్ అడగ్గా, విరాట్ ఒక్కసారిగా నవ్వేశాడు. 'నాకు కూడా తెలియదు. అయినా ఈ ప్రశ్న నన్ను ఎందుకు అడుతున్నావ్ అది ఫారిన్ ప్లేయర్లను అడుగు. నేను ఫారిన్ ప్లేయర్ కాదు. నువ్వే చెప్పు నేను ఓవర్సీస్ ప్లేయర్‌నా' అని రివర్స్‌లో నాగ్స్‌ను విరాట్ అడిగాడు. దీనికి 'కచ్చితంగా కాదు' అని అతడు రిప్లై ఇచ్చాడు. ఈ వీడియోను ఆర్సీబీ తమ సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీనికి ఫన్నీ కామెంట్లు వస్తున్నాయి. ఫ్యామిలీతో లండన్‌లోనే ఉంటున్న కారణంగా ఐపీఎల్‌లోనూ ఆర్సీబీ మ్యాచ్‌ల మధ్య ఎక్కువగా గ్యాప్ వస్తే తనను అక్కడికే పంపించాలని ఫ్రాంచైజీని విరాట్ కోరినట్లు ప్రచారం సాగుతోంది. ఇందుకోసం స్పెషల్ ఫ్లైట్ ఏర్పాటు చేయాలని విరాట్ అడిగితే, ఫ్రాంచైజీ కూడా ఓకే చెప్పిందని వార్తలు వచ్చాయి. అయితే అవన్నీ ఫేక్ అని విరాట్ కొట్టిపారేశాడు. అలాంటిదేమీ లేదని అన్నాడు. మిస్టర్ నాగ్ బెంగళురుకు చెందిన ఒక కమెడియన్. అతని అసలు పేరు డానిష్ సెయిట్ అలియాస్ డానీ. ఎదుటివారిని నొప్పించకుండా నవ్వించడం నాగ్స్ స్పెషాలిటీ. అతడు కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో అర్సీబీకో ట్రావెల్ చేస్తున్నాడు. ప్రతీ సీజన్‌లో ఆర్సీబీ ప్లేయర్లతో ముఖ్యంగా విరాట్ కోహ్లీతో ఇలాంటి ఫన్నీ చిట్ చాట్ నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య మంచి బాండింగ్ ఏర్పడింది.

# సమీర్ రిజ్వీ విధ్వంసం.. ముంబైని చిత్తుగా ఓడించిన ఢిల్లీ..!



పంతొమ్మిదో సీజన్‌లో ఇంప్యాక్ట్ సబ్ సమీర్ రిజ్వీ(90) జోరుతో ఢిల్లీ క్యాపిటల్స్ వరసగా రెండో విజయంతో మురిసింది. సొంత మైదానంలో రిజ్వీ దూకుడు ముందు ముంబై ఇండియన్స్ బౌలర్లు తేలిపోగా.. 163 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ ఉఫ్‌మనిపించింది. ఆరంభంలోనే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వని రిజ్వీ ఓపెనర్ పథుమ్ నిశాంక(44)తో కలిసి జట్టు విజయానికి బాటలు వేశాడు. ఈ హిట్టర్‌కు డేవిడ్ మిల్లర్(21 నాటౌట్) మెరుపులు తోడవ్వగా.. 18.1 ఓవరల్లోనే మ్యాచ్‌ను ముగించింది ఢిల్లీ. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఛేజింగ్ జట్లు విజయదుంధుబి మోగిస్తున్నాయి. తమ సొంత ఇలాకాఆరుణ్ జైట్లీ స్టేడియంలో పంజా విసిరిన ఢిల్లీ క్యాపిటల్స్ పటిష్టమైన ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత ప్రత్యర్థిని 163కే కట్టడి చేసింది ఢిల్లీ.



# ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో గుజరాత్‌కు చుక్కెదురు.. రాజస్థాన్‌కు రెండో విజయం..!




ఐపీఎల్‌లో ఏకపక్ష మ్యాచ్‌లతో విసిగిపోయిన అభిమానులను ఉత్కంఠ పోరు అలరించింది. భారీ స్కోర్ల పోరులో ఆఖరి ఓవర్ వరకూ ఆధిపత్యం చేతులు మారుతూ వచ్చిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌నే విజయం వరించింది. 211 పరుగుల ఛేదనలో సాయి సుదర్శన్(73) మెరుపులతో గెలుపు దిశగా సాగిన గుజరాత్ టైటాన్స్‌ను లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్(4-41)దెబ్బతీశాడు. చివరి ఓవర్లో ఆ జట్టు గెలవాలంటే 10 చేయల్సి రాగా.. తుషార్ దేశ్‌పాండే అద్భుతంగా బౌలింగ్ చేసి రాజస్థాన్‌ను గెలిపించాడు. యార్కర్లతో గుజరాత్ బ్యాటర్లను నిలువరించిన ఈ కుర్రాడు 4 పరుగులే ఇవ్వడంతో రియాన్ పరాగ్ సేన వరుసగా రెండో విక్టరీ కొట్టింది.ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ రెండో విజయంతో మురిసింది. భారీ స్కోర్‌తో గుజరాత్ టైటాన్స్‌కు సవాల్ విసిరిన రాజస్థాన్ బౌలర్ల విజృంభణతో మ్యాచ్‌ను కాపాడుకుంది. భారీ ఛేదనను దూకుడుగా ఆరంభించిన గుజరాత్ టైటాన్స్.. ఊహించని విధంగా తడబడింది. ఓపెనర్లు సాయి సుదర్శన్(73), కుషగ్ర(18)లు తొలి వికెట్‌కు 78 పరుగులు జోడించి గెలుపు దిశగా నడిపారు. కానీ, కుషగ్రను ఔట్ చేసి బ్రేకివ్వగా.. అర్ధ శతకంత తర్వాత సుదర్శన్ వెనుదిరిగాడు.

# సంజు శాంసన్‌కు కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మద్దతు



ఐపీఎల్ 2026 సీజన్లో సీఎస్కే తరఫున ఆడుతున్న సంజు శాంసన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్ నుంచి భారీ అంచనాలతో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వచ్చిన సంజు శాంసన్.. ఇప్పటివరకు ఆడిన రెండు ఇన్నింగ్స్‌లలో కేవలం 6, 7 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన ప్లేయర్ ఇలా వరుసగా విఫలమవ్వడంతో అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అయితే జట్టు హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాత్రం తమ ఆటగాడికి పూర్తి మద్దతుగా నిలిచారు. మీడియా సమావేశంలో సంజు శాంసన్ ఫామ్ గురించి అడిగిన ప్రశ్నపై స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పందిస్తూ.. విమర్శకులకు గట్టి సమాధానం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. " టీ20 క్రికెట్లో ప్రతి మ్యాచ్‌లోనూ పరుగులు సాధించడం సాధ్యం కాదు. సంజు శాంసన్ ప్రస్తుతం మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. నెట్స్‌లో సంజు అద్భుతంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. కేవలం రెండు ఇన్నింగ్స్‌ల ఆధారంగా సంజు శాంసన్ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయలేం. ఒక్కసారి అతను ఫామ్ అందుకుంటే మ్యాచ్ విన్నర్‌గా నిలుస్తాడు. కాబట్టి సంజు శాంసన్ ఫామ్ గురించి మాకు ఎలాంటి ఆందోళన లేదు" అని స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పష్టం చేశాడు. గణాంకాలను పరిశీలిస్తే.. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో సంజు శాంసన్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఈ స్టేడియంలో ఇప్పటివరకు 6 ఇన్నింగ్స్‌లలో సంజు శాంసన్ కేవలం 66 పరుగులు మాత్రమే చేశాడు. ఇక్కడ సంజు శాంసన్ సగటు 11 కాగా.. స్ట్రైక్ రేట్ 100గా ఉంది. ఐపీఎల్‌లో కనీసం 5 ఇన్నింగ్స్‌లు ఆడిన స్టేడియాల్లో సంజు శాంసన్‌కు ఇదే అత్యల్ప సగటు కావడం గమనార్హం. అయినప్పటికీ.. సీజన్లో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయని.. సంజు శాంసన్ ఖచ్చితంగా పుంజుకుంటాడని సీఎస్కే యాజమాన్యం ధీమా వ్యక్తం చేస్తోంది. గత సీజన్లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్.. ఈ సీజన్లో కూడా ఆరంభంలోనే వరుసగా రెండు ఓటములను చవిచూసింది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో ఓటమి పాలైన సీఎస్కే.. ఇప్పుడు తన తదుపరి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో తలపడనుంది. ఆదివారం జరగబోయే ఈ కీలక పోరులోనైనా సంజు శాంసన్ ఫామ్‌లోకి వచ్చి జట్టుకు తొలి విజయాన్ని అందిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

# ఆర్చర్‌కు చుక్కలు చూపించిన వైభవ్ సూర్యవంశీ



ఐపీఎల్ 2026 సీజన్లో ప్రస్తుతం క్రికెట్ అభిమానులందరి నోట్లో వినిపిస్తున్న ఒకే ఒక్క పేరు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. కేవలం 15 ఏళ్ల వయసులోనే దిగ్గజ బౌలర్లను తన బ్యాటింగ్ పవర్‌తో భయపెడుతున్న ఈ రాజస్థాన్ రాయల్స్ 'వండర్ బాయ్' నేడు గుజరాత్ టైటాన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు నెట్స్‌లో బీభత్సం సృష్టించాడు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ శైలి చూస్తుంటే.. అప్పుడే అంతర్జాతీయ స్థాయి అనుభవం ఉన్న ఆటగాడిలా కనిపిస్తున్నాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ 46 సెకన్ల వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఇందులో ఇంగ్లాండ్ స్టార్ పేసర్ ప్రపంచంలోని అత్యంత వేగవంతమైన బౌలర్లలో ఒకరైన జోఫ్రా ఆర్చర్ వేస్తున్న నిప్పులు చెరిగే బంతులను వైభవ్ ఏమాత్రం తడబడకుండా ఎదుర్కోవడం విశేషం. సాధారణంగా జోఫ్రా ఆర్చర్ వేగానికి దిగ్గజ బ్యాటర్లే డిఫెన్స్‌లో పడతారు. కానీ వైభవ్ సూర్యవంశీ మాత్రం క్రీజులో నిలబడి భారీ సిక్సర్లు, క్లాసీ ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఈ వీడియో చూసిన అభిమానులు.. జోఫ్రా ఆర్చర్‌నే వదలని ఈ కుర్రాడిని ఆపడం ఎవరి తరమని చర్చించుకుంటున్నారు. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లోనే సీఎస్కే బౌలర్లపై వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించిన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో 305.88 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో కేవలం 17 బంతుల్లో 52 పరుగులు సాధించి రాజస్థాన్ రాయల్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. వైభవ్ ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, 5 కళ్లు చెదిరే సిక్సర్లు ఉండటం గమనార్హం.వైభవ్ సూర్యవంశీ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఆడిన కేవలం 8 మ్యాచ్‌ల్లోనే వైభవ్ 304 పరుగులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. వైభవ్ సూర్యవంశీ స్ట్రైక్ రేట్ 218.70గా ఉందంటేనే అతని దూకుడు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్ చరిత్రలో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించడమే కాకుండా.. కేవలం 35 బంతుల్లోనే గుజరాత్ టైటాన్స్‌పై గతంలో సెంచరీ బాది, లీగ్ చరిత్రలో రెండో వేగవంతమైన సెంచరీ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరగబోయే మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాట్‌తో మ్యాజిక్ చేస్తాడేమో చూడాలి.

# ఐపీఎల్‌లో పోటీ అత్యంత కఠినంగా ఉంటుంది

**• ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేళ జయవర్దనే**

ఐపీఎల్‌లో తమ జట్టు ఐదు టైటిల్స్ గెలిచిందని, కొన్ని జట్లు ఇంకా ఒక్క ట్రోఫీ కూడా అందుకోలేదని ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మహేళ జయవర్దనే అన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశాడు. గత ఐదేళ్లుగా ముంబై టైటిల్ గెలవలేదు. ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. కొన్ని జట్లు ఒక్క టైటిల్ కూడా గెలవలేదని గుర్తు చేశాడు. ఐపీఎల్ 2020 సీజన్‌లో విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ తర్వాతి ఐదు సీజన్లలో ఫైనల్ చేరలేకపోయింది. ఈ సీజన్‌ను ఘనంగా ప్రారంభించి 14 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన ముంబై ఇండియన్స్.. అదే జోరు కనబర్చాలనే లక్ష్యంతో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో జయవర్దనే మాట్లాడాడు. ఐపీఎల్‌లో పోటీ అత్యంత కఠినంగా ఉంటుందని చెప్పాడు.'పది జట్లతో కూడిన ఐపీఎల్‌లో పోటీ చాలా కఠినంగా ఉంటుంది. గత ఐదేళ్లలో మేం టైటిల్ గెలవలేకపోయాం. కానీ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచాం. కాబట్టి మేం సరిగ్గా ఆడలేదనే ప్రశ్నే అనవసరం. గత కొన్నేళ్లుగా తమ జట్టు నిలకడగా రాణిస్తోంది. మా ప్రాసెస్‌పై మాకు నమ్మకం ఉంది. ఇక ముందూ భిన్నంగా చేయాల్సిన అవసరం లేదు. ఐదేళ్ల నుంచి మేం టైటిల్ గెలవలేదు. కానీ ఇప్పటికీ ఒక్క టైటిలూ నెగ్గని జట్లూ ఉన్నాయి. కాబట్టి, దాని గురించి మేం ఆందోళన చెందడం లేదు.'అని మహేల జయవర్దనే స్పష్టం చేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్(36 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీతో రాణించగా.. రోహిత్ శర్మ(26 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 35) విలువైన పరుగులు చేశాడు. ఢిల్లీ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీయగా.. లుంగి ఎంగిడి, అక్షర్ పటేల్, విప్రజ్ నిగమ్, నటరాజన్ తలో వికెట్ తీసారు. అనారోగ్యంతో ఈ మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం కాగా.. సూర్యకుమార్ యాదవ్ తాత్కలిక సారథిగా జట్టును నడిపిస్తున్నాడు.

# 10న విడుదలవుతున్న డెకాయిట్

## ట్రైలర్ విడుదల చేసిన చిత్ర బృందం




అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. 'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టిందన్నారు.

-------------

# రాముడు, పరశురాముడు.. రెండూ రణ్‌బీర్ కపూరే

**ద్విపాత్రాభినయం గురించి వెల్లడించిన రణ్‌బీర్**

ప్రకటించిన నాటినుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 'రామాయణ'. ఇటీవల దీని టీజర్ విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇందులో రణ్‌బీర్ శ్రీరాముడితో పాటు పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. 'శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశురాముడు. ఈ సినిమాలో శ్రీరాముడితో పాటు పరశు రాముడిగా కూడా నటించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి సినిమాల్లో నటించేటప్పుడు బాడీ లాంగ్వేజ్ మాత్రమే కాదు.. ఆ పాత్రల వెనక ఉన్న ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. 'రామాయణ' చిత్రీకరణకు ముందు ఏడాది పాటు ఆ పాత్రల గురించి బాగా తెలుసుకున్నానని రణ్‌బీర్ తెలిపారు.ప్రస్తుతం 'రామాయణ'కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా కోసం ఓ ఓటీటీ సంస్థ భారీ డీల్‌కు ముందుకు వచ్చిందిట. కానీ, నిర్మాత నమిత్ మల్హోత్రా ఆ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. రెండు భాగాలకు కలిపి ఓటీటీ సంస్థ రూ.1000 కోట్లకు అడగ్గా.. ఆయన దాన్ని తిరస్కరించారట. ఈ డిజిటల్ హక్కుల విషయంలో ఆయన 'ధురంధర్' చిత్రబృందం వ్యూహాన్ని అనుసరించాలని చూస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మొదట పార్ట్ వన్‌తో డీల్ కుదుర్చుకుని అది విడుదలైన తర్వాత దానికి వచ్చిన స్పందనను బట్టి రెండో భాగానికి ఒప్పందం కుదుర్చుకోవచ్చని నిర్మాత భావిస్తున్నట్లు సమాచారం. రూ.4000 కోట్లతో అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం దాని వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి. తాజాగా ఈ సినిమా రన్‌టైంకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ మీడియాతో 'రామాయణ్' సినిమా విశేషాలను పంచుకుంటున్న సమయంలో.. రణ్‌బీర్ కపూర్ అతడికి తెలియకుండానే సినిమా రన్‌టైం గురించి నోరు జారడు. ఈ సినిమా గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ.. దాదాపు 6 గంటల ఎపిక్ విజువల్స్‌తో ఈ సినిమా రాబోతుంది. రామాయణం అనేది ఒక మహా కావ్యం. దీనిని ఏమాత్రం కుదించకుండా, ప్రతి కీలక ఘట్టాన్ని అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించేందుకే మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని రణ్‌బీర్ తెలిపాడు.

------------



# అంతర్జాతీయ వేదికపై మరోసారి.. అరుదైన ఘనత సాధించిన రష్మిక!



పేరుకే కన్నడ బ్యూటీ.. నేడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. అందం అభినయంతో కాదు నటనతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది.. నేడు పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న ఈమె.. గత మూడు సంవత్సరాలుగా వరుస చిత్రాలతో.. ఊహించని విజయాలతో.. బాక్సాఫీస్ కలెక్షన్స్ తో స్టార్ హీరోల రికార్డులను కూడా బ్రేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, సికందర్ , ది గర్ల్ ఫ్రెండ్, కుబేర ఇలా వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ వసూలు చేస్తూ.. బాక్సాఫీస్ క్వీన్ గా పేరు సొంతం చేసుకుంది రష్మిక మందన్న . ఇదిలా ఉండగా అటు కెరియర్ పరంగా బిజీగా మారిన ఈమె.. ఇటు వ్యక్తిగతంగా తన ప్రాణ స్నేహితుడైన విజయ్ దేవరకొండ తో ఏడడుగులు కూడా వేసింది. ఇక ఇప్పుడు వివాహితగా మారిన తర్వాత తన భర్త విజయ్ దేవరకొండ తో కలిసి చేస్తున్న తొలి చిత్రం రణబాలి. ఇప్పటికే ఈ సినిమాలోని రాయలసీమ ప్రాంతానికి సంబంధించి షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకున్నారు. మరొకవైపు మైసా అనే సినిమాలో కూడా నటిస్తోంది రష్మిక . ఇలా కెరియర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా మారిన ఈమె తాజాగా మరోసారి అంతర్జాతీయ వేదికపై కనిపించనుంది. అంతేకాదు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సినీ నటిగా పేరు కూడా సొంతం చేసుకుంది రష్మిక. ఇండియా స్వీట్ హార్ట్ గా రష్మిక.. పూర్తి వివరాల్లోకి వెళితే.. జపాన్ లోని టోక్యోలో మే 23వ తేదీన జరగనున్న "క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026"లో రష్మిక ప్రజెంటర్ గా వ్యవహరించబోతోంది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈమె రెండవసారి కనిపించడం గమనార్హం.. 2024 లోనే ఈమె ఈ అవార్డ్స్ వేడుకల్లో ప్రజెంటర్ గా సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకసారి ఈ అవకాశం అందుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# ఆది సాయికుమార్ కొత్త చిత్రం... 'సైరాభాను'




యంగ్ హీరో ఆది సాయికుమార్ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రారంభించారు. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. శుక్రవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది.

ఇటీవలే 'కె-ర్యాంప్' చిత్రంతో సంచలన విజయం అందుకున్న ప్రముఖ నిర్మాత రాజేష్ దండా తన హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆది సాయికుమార్ సరసన బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. గులాబీ రంగు మేఘం, దాని కింద 'ప్రేమ, విశ్వాసం, విధికి సంబంధించిన ఒక సరదా ప్రయాణం' అనే ట్యాగ్‌లైన్‌తో రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఇది ఒక హిందూ-ముస్లిం ప్రేమకథ అని, వినోదభరితంగా సాగుతుందని తెలుస్తోంది. రాజమండ్రి, హైదరాబాద్ నగరాల నేపథ్యంలో కథ నడుస్తుంది. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిరణ్ అబ్బవరం, రామ్ అబ్బరాజు, కోన వెంకట్ తదితరులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

'శంబాల'తో కెరీర్‌లో మంచి హిట్ అందుకున్న ఆది సాయికుమార్, ప్రస్తుతం కథాబలం ఉన్న కమర్షియల్ చిత్రాలను ఎంచుకుంటున్నారు. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# డైరెక్టర్లకు రైటర్లకు పని పెట్టిన యాంగ్రీ యంగ్ మెన్!

: ఓడలు బల్లవుతాయి..బల్లు ఓడలవుతాయి అంటారు పెద్దలు. ఇది జీవితంలో సహజం. ఎప్పుడు ఎవరి స్థార్ తిరుగుతుందో..ఎవరి స్థానం ప్రధాన స్థాయికి చేరుకుంటుందో ఇక్కడ ఎవరూ చెప్పలేరు. కాలాన్ని బట్టి మార్పులు వస్తుంటాయి. వాటిని అంతే హుందాతో స్వీకరించిన వారు విజయవంతంగా కెరీర్‌లో దూసుకుపోతూ ముందుకు సాగుతుంటారు. ఆ మార్పులు స్వీకరించని వారు అక్కడే ఉండిపోతారు. కాల క్రమేణా తెరమరుగవుతుంటారు. ఇదే విషయాన్ని బాగా ఒంటబట్టించుకున్నట్టున్నాడు యాంగ్రీ యంగ్ మెన్‌గా పేరు తెచ్చుకున్న డా. రాజశేఖర్.యాంగ్రీ యంగ్‌మెన్ డాక్టర్ రాజశేఖర్..ఒక దశలో పవర్ ఫుల్ కాప్ స్టోరీస్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో. అంకుశం, ఆహుతి, ఆవేశం వంటి పవర్‌ఫుల్ స్టోరీస్‌తో ప్రేక్షకుల్లో పోలీస్ అంటే ఇలా ఉండాలని ఓ ట్రేడ్ మార్క్‌ని సెట చేసి హీరోగా ప్రత్యేకతను చాటుకున్న డా. రాజశేఖర్ ఆ తరువాత ఆ స్థాయిలో ఆకట్టుకోవడంతో తడబడ్డారు. ఏజ్ ఫ్యాక్టర్, మారిన పరిస్థితులు, ప్రేక్షకుల అభిరుచి కారణంగా ఆయన హీరోగా రేసులో వెనకబడ్డారు. ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా గ్రహించిన ఆయన కొత్త తరహా పాత్రలతో సెండ్ ఇన్నింగ్స్‌ని స్టార్ట్ చేయాలని చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు.

కానీ ఏదీ వర్కవుట్ కాలేదు. ఒకటి రెండు సినిమాలు అంగీకరించినా వారు రాజశేఖర్ వంటిప్రొటెన్షియల్ ఉన్న స్టార్‌ని ఉపయోగించుకోవడంతో, ఆయన క్యారెక్టర్‌ని పవర్ ఫుల్‌గా డిజైన్ చేయడంలో ఫెయిలయ్యారు. దాంతో రాజశేఖర్ సెకండ్ ఇన్నింగ్స్ ప్రశ్నార్థకంలో పడింది. కోవిడ్ కారణంగా ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొని చావు దాకా వెళ్లొచ్చిన ఆయనకు ఇప్పటికి సరైన సినిమా దొరికింది అదే –బైకర్–. శర్వానంద్ హీరోగా నటించిన బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో డా. రాజశేఖర్ ఆయన ఇమేజ్‌కి తగ్గ క్యారెక్టర్‌లో నటించి మెప్పించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613